క్లుప్తంగా

నేటి నుంచి రేషన్‌షాపుల వద్దే సరుకులు పంపిణీ



విస్సన్నపేట: రేషన్ కార్డుదారులు జూన్ ఒకటి నుంచి సరుకులను రేషన్ షాపుల వద్దే తీసుకోవాలని ఆర్డీఓ మాధురి అన్నారు. స్థానిక సివిల్ సప్లయిాయ్ గోడౌన్‌ను ఆర్డీఓ శనివారం తనిఖీ చేశారు. గోడౌన్‌లో ఉన్న స్టాక్‌ను, రికార్డులను పరిశీలించారు. షాపుల వద్దే రేషన్ పంపిణీకి డీలర్లకు తగిన సూచనలు చేశామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె. లక్ష్మీకల్యాణి, ఆర్ఐ సుజాత పాల్గొన్నారు.

నూజివీడు: ఈనెల ఒకటి నుంచి రేషన్ కార్డుదారులకు నిత్యావసర సరుకులు పంపిణీని రేషన్ దుకాణాల వద్ద డీలర్ల ద్వారా పంపిణీ చేస్తారని నూజివీడు తహసీల్దార్ గుగులోతు భద్రూ శనివారం తెలిపారు. పట్టణం, మండలంలోని అన్ని గ్రామాల్లో ఆయా రేషన్ షాపుల వద్ద ప్రతి నెలా 15 వరకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు సరుకులను పంపిణీ చేస్తారని చెప్పారు.

గ్రంథాలయాలతో విజ్ఞానం పెంపు



మైలవరం: విద్యార్థులు ప్రతి రోజూ గ్రంథాలయానికి వెళ్లి మంచి పుస్తకాలు, పత్రికలు చదవడం ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని గణపవరం ఎంపీయూపీ పాఠశాల ఉపాధ్యాయుడు టి. ఓంప్రకాష్ అన్నారు. మైలవరం శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరంలో విద్యార్థినీ, విద్యార్థులకు నోబెల్ బహుమతి గ్రహీతలు, వారి చరిత్రను శనివారం ఆయన వివరించారు. తెలుగు, ఇంగ్లిష్ దినపత్రికలను విద్యార్థులతో చదివించారు. విద్యార్థులు, పాఠకులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

హోటళ్ల తనిఖీ

నందిగామ రూరల్: పరిశుభ్రత పాటించని హోటళ్లు, టిఫిన్ సెంటర్ల నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని ఫుడ్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు హెచ్చరించారు. పట్టణంలోని ఆయా ప్రాంతాల్లోని హోటళ్లు, టిఫిన్ సెంటర్లను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ హోటళ్ల పేరుతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడితే సహించేది లేదని హెచ్చరించారు.

డీఈఈ రమేష్‌బాబుకు ఉద్యోగ విరమణ సన్మానం



ఇబ్రహీంపట్నం: ప్రతి ప్రభుత్వ ఉద్యోగి ఉద్యోగ విరమణ చేయక తప్పదని ఎన్టీటీపీఎస్ చీఫ్ ఇంజనీర్ శివ రామాంజనేయులు అన్నారు. ఎన్టీటీపీఎస్ సివిల్ విభాగంలో డీఈఈగా విధులు నిర్వహించి పదవీ విరమణ చేసిన గొట్టిముక్కల రమేష్‌బాబు దంపతులకు శనివారం శాలువా కప్పి సన్మానించారు. ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో సంస్థ పురోభివృద్ధికి తోడ్పడటమే కాకుండా తోటి ఉద్యోగులకు రమేష్‌బాబు ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. కార్యక్రమంలో పలువురు ఉద్యోగులు, ఇంజనీర్లు పాల్గొన్నారు.

ఉపాధి వేతనాల కోసం ఎదురుచూపులు



చాట్రాయి: ఉపాధి హామీ పథకంలో చేసిన పనికి వేతనాలు విడుదల కాక కూలీలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఎండలో కష్టపడి చేసినా నెలల తరబడి వేతనాల కోసం ఎదురు చూస్తున్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో రోజుకు 4 వేల మంది కూలీలు ఉపాధి పనులు చేస్తున్నారు. ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు రూ. 1.39 కోట్ల వేతనాలు చెల్లించాల్సి ఉంది. కానీ ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా వేతనం ప్రభుత్వం చెల్లించకపోతే ఏమి తిని బతకాలని ఉపాధి కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో వారం వారం వేతనాలు పడేవని, ఇప్పుడు నెలలు గడిచినా వేతనాలు ఎందుకు చెల్లించడం లేదని కూలీలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా చేసిన పనికి వేతనాలు చెల్లించాలని కూలీలు కోరుతున్నారు.

హెచ్‌ఎంల బాధ్యతల స్వీకారం

చాట్రాయి: మండలంలోని పలు హైస్కూళ్లలో నూతన ప్రధానోపాధ్యాయులు బాధ్యతలు చేపట్టారని ఎంఈఓ బ్రహ్మాచారి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చనుబండ జెడ్పీ హైస్కూల్‌కు ఎం. రవీంద్రనాథ్, పోలవరానికి ఆర్. శ్రీనివాసరావు, మర్లపాలెం హైస్కూల్‌కు అప్పారావు ప్రధానోపాధ్యాయులుగా బాధ్యతలు చేపట్టారని చెప్పారు.

అప్రమత్తం.. కాకుంటే అనారోగ్యం

- ఈ ఏడాది ముందుగానే కురుస్తున్న వర్షాలు
- గ్రామాల్లో పెరిగిన దోమల ఉధృతి
- పరిసరాల పరిశుభ్రత అవసరమంటున్న వైద్యులు
- మైలవరం నియోజకవర్గంలో డ్రెయినేజీ వ్యవస్థ లేక అవస్థలు



గుంటుపల్లి రైల్వే స్పోర్ట్స్ కాంప్లెక్స్ వద్ద వర్షం నీటిలో ఆడుతున్న చిన్నారులు (ఫైల్)

జి.కొండూరు: ఈ ఏడాది ముందుగానే వాతావరణం చల్లబడింది. రోహిణి కార్తె ప్రారంభానికి ముందు నుంచే వర్షాలు కురుస్తున్నాయి. నైరుతి రుతుపవనాలు కూడా ముందుగానే వచ్చాయి. అయితే ఈ వర్షాల మాటున ప్రమాదం కూడా దాగి ఉంది. వర్షం నీరు డ్రెయినేజీ నీటితో కలిసి ఇళ్ల పరిసరాల్లో ప్రవహించడం వల్ల వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉంది. చిన్నారులు ఎక్కువగా వర్షంలో తడుస్తూ పరసరాల్లో నిల్వ ఉన్న నీటిలో ఆటలాడుతుంటారు. ఇలా చేయడం వలన వర్షాకాలంలో పిల్లలు ఎక్కువగా వ్యాధుల భారిన పడుతుంటారు. అదేవిధంగా కరోనా కూడా వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో పిల్లల పట్ల అప్రమత్తంగా ఉండడంతో పాటు పెద్ద వారు కూడా ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు.

పరిసరాల పరిశుభ్రత ముఖ్యం

డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో వర్షం పడిన సమయంలో మురుగునీరు, వర్షం నీటితో కలసి రహదారులపై ప్రవహిస్తోంది. కొన్ని చోట్ల ఇళ్లల్లోకి కూడా వర్షంనీరు, మురుగునీరు కలిసి రావడం వలన వ్యాధులు త్వరగా వ్యాప్తి చెందే అవకాశం ఉంది. ఎవరి ఇంటి పరిసరాలలో వారు మురుగునీరు నిల్వలేకుండా చర్యలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

మైలవరం నియోజకవర్గంలో

మైలవరం నియోజకవర్గంలో 62 గ్రామ పంచాయతీలు ఉండగా 72,729 కుటుంబాలకు గానూ మూడున్నర లక్షల మందికి పైగా జనాభా నివసిస్తున్నారు. నియోజకవర్గంలో ఎక్కడా డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో భారీ వర్షాలు పడిన సమయంలో మురుగు నీటితో కలిసి వర్షం నీరు ప్రవహిస్తోంది. పలు చోట్లు దశాబ్దాల కిందట నిర్మించిన సీసీ రోడ్లు సైతం పల్లం కావడంతో మురుగునీరంతా రోడ్లపైకి చేరుతోంది. దీనితో వర్షాలు ప్రారంభం కాగానే నియోజకర్గంలో సీజనల్ వ్యాధులు వేగంగా వ్యాప్తి చెందుతున్నాయి.



భీమవరప్పాడులో ఇళ్ల మధ్య రోడ్డుపై చేరిన మురుగునీరు

చిన్నారులకు రోగ నిరోధక శక్తి తక్కువ

సాధారణంగా ప్రాథమిక స్థాయి విద్యనభ్యసించే చిన్నారుల్లో రోగ నిరోధక శక్తి తక్కువగా ఉంటుంది. ఈ వయస్సు పిల్లలు ఎక్కువగా వర్షంలో తడవడానికి, నిల్వ ఉన్న నీటిలో ఆటలు ఆడడానికి ఇష్టపడుతుంటారు. బహిరంగ ప్రదేశాల్లో విక్రయించే తినుబండారాలను ఎక్కువగా తింటుంటారు. ఇటువంటి అలవాట్ల వల్ల పిల్లల ఆరోగ్యం తొందరగా దెబ్బతింటుంది. కాబట్టి ఇంటి దగ్గర తయారు చేసినవే పిల్లలకు ఆహారంగా ఇవ్వాలి. ముఖ్యంగా తాగు నీటి విషయంలో జాగ్రత్తలు పాటించాలి.

వైద్యుల సూచనలు ఇవి..

- కాచి చల్లార్చిన నీటిని తాగాలి.
- తాజాగా ఉండే ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలి.
- మాంసాహార తినుబండారాలను తగ్గించాలి.
- పరిసరాల పరిశుభ్రత పాటించాలి. బహిరంగ మల, మూత్ర విసర్జన చేయకూడదు. మల, మూత్ర విసర్జన అనంతరం చేతులను శుభ్రపరుచుకోవాలి.
- డ్రెయినేజీల్లో నీరు నిల్వ ఉన్న చోట కిరోసిన్ లేదా బ్లీచింగ్ తరచూ చల్లుతుండాలి.
- వర్షంలో తడవకుండా రెయిన్ కోటు, గొడుగు వంటివి వాడాలి.
- ఇంటి పరిసర ప్రాంతాలలో కుండ పెంకులు, కొబ్బరి చిప్పల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి.

పరిశుభ్రత అవసరం



వర్షాలు పడుతున్నందున వ్యాధులు ప్రబలకుండా పరిశుభ్రత పాటించాలి. వర్షాకాలంలో మురుగునీరు, చెత్తాచెదారం నిల్వ ఉన్న చోట దోమలు, ఈగలు ఎక్కువగా చేరుతాయి. వీటి వల్ల డయేరియా, మెదడు వాపు, డెంగీ, మలేరియా, చికున్‌గున్యా వంటి ప్రాణాంతక వ్యాధులు ఎక్కువగా వ్యాపిస్తాయి. వర్షంలో తడవడం వల్ల దగ్గు, జలుబు, కలరా వంటి వ్యాధులు సోకే ప్రమాదం ఉంది. పిల్లలు ఎక్కువగా జ్వరాల బారిన పడుతుంటారు. కరోనా కూడా వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి.

– డాక్టర్ ప్రసన్నరాణి, జి.కొండూరు మండల వైద్యాధికారి

నేడు సామూహిక 'యోగాంధ్ర'

ఇబ్రహీంపట్నం: అంతర్జాతీయ యోగా మాసోత్సవాల్లో భాగంగా స్థానిక పవిత్రసంగమం వద్ద సామూహిక యోగాసన కార్యక్రమాలు ఆదివారం ఉదయం 5.30 గంటలకు నిర్వహిస్తామని ఎంపీడీవో సునీతశర్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా ఏపీ జెన్‌కో ఎండీ కేవీఎన్ చక్రధర బాబు, జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ, పలువురు ప్రభుత్వ ఉన్నతాధికారులు హాజరవుతారన్నారు. మండల స్థాయిలో ప్రజాప్రతినిధులు, ఇతర వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

తిరువూరు: ఎ.కొండూరు మండలం అట్లప్రగడలో నెలకొన్న ప్రధాన సమస్యలు పరిష్కరించాలని మాదిగ యువసేన నాయకుడు శీలం సుదీర్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం తిరువూరు ఆర్డీఓ కె. మాధురికి వినతిపత్రం అందజేశారు. కంభంపాడు పంచాయతీలోని అట్లప్రగడ అభివృద్ధికి నోచక, కనీస సదుపాయాలు కరువై ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, తాగునీరు, రహదారులు, డ్రెయినేజీ సదుపాయాలు మెరుగుపరచాలని ఆయన కోరారు.

నేడు విద్యార్థులకు వ్యాస రచన పోటీలు

తిరువూరు: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఆదివారం తిరువూరు గ్రంథాలయంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామని గ్రంథాలయాధికారి పద్మావతి తెలిపారు. యోగా ఆవశ్యకతపై వ్యాసరచన పోటీలు జరుగుతాయన్నారు. ఆసక్తిగల విద్యార్థులు పాల్గొనాలని కోరారు. తిరువూరు నగర పంచాయతీ ఈ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తుందన్నారు.

పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలి

నూజివీడు: పొగాకు వాడకం వల్ల అనేక అనారోగ్య సమస్యలకు ప్రజలు గురవుతున్నారని నూజివీడు ఆర్టీసీ డిపో మేనేజర్ సీహెచ్ సూర్య పవన్‌కుమార్ అన్నారు. నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శనివారం నూజివీడు బస్టాండులో 'నేను పొగాకుకు వ్యతిరేకిని' అని సంతకాల సేకరణను, వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. పొగ తాగే వారికే కాకుండా వారి చుట్టూ ఉన్న వారికి కూడా హాని కలుగుతుందన్నారు. పొగ తాగడం వల్ల వచ్చే ప్రమాదాలపై అవగాహన లేకపోవడం వల్లే ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారని చెప్పారు. నవజీవన్ బాల భవన్ జోనల్ కో–ఆర్డినేటర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నికోటిన్ వల్ల చాలామంది సిగరెట్ తాగేందుకు అలవాటవుతున్నారన్నారు. పొగతాగే వ్యసనానికి దూరంగా ఉండాలని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన జీవనం సాగించాలని చెప్పారు. కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

ధూమపాన వ్యతిరేక దినోత్సవం

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ధూమపాన వ్యతిరేక దినోత్సవ కార్యక్రమం కొండపల్లిలో శనివారం నిర్వహించారు. ధూమపానం వలన కలిగే అనర్థాలపై కరపత్రాలు ఆవిష్కరించారు. ప్రముఖ సర్జన్ డాక్టర్ మామిడి సీతారామారావు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా సంభవిస్తున్న మరణాల్లో పొగ తాగేవారి మరణాలే ప్రథమస్థానంలో ఉన్నాయన్నారు. పొగతాగే వారిలో 20 నుంచి 25 ఏళ్ల వయస్సు తగ్గుతుందని చెప్పారు. వీరిలో ఊపిరి తిత్తుల క్యాన్సర్, గుండె జబ్బులు సంభవిస్తాయన్నారు. పొగాకును వివిధ రకాలుగా సేవించడం వల్లనే వ్యాధులకు గురవుతున్నారని వివరించారు. జేవీవీ జిల్లా అధ్యక్షుడు వెనిగళ్ల మురళీమోహన్, ఉపాధ్యక్షుడు కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కొండపల్లిలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న మురళీమోహన్ తదితరులు

2న హామీల అమలు కోరుతూ ఆందోళనలు

మైలవరం: సూపర్ సిక్స్ హామీలు, కూటమి నాయకులు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జూన్ 2న సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని, ప్రజలంతా భాగస్వాములై విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. జూన్ 2న ఆందోళన కార్యక్రమాలు విజయవంతం చేయా లని కోరుతూ మైలవరంలో శనివారం ప్రచా రం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నివేశన స్థలాలు లేని నిరుపేదలకు గ్రామాల్లో ఒక్కొక్కరికీ 3 సెంట్లు, పట్టణాలలో 2 సెంట్ల చొప్పున ఇంటి స్థలం, ప్రతి ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు చొప్పున ఇవ్వాలని, సూపర్ సిక్స్ హామీలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నాయకులు పోతురాజు సాంబయ్య, గణపతి, కట్టా ఆదినారాయణ, నమ్మిక శ్రీనివాసరావు, పి. వీరాస్వామి, దేవమ్మ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు

తిరువూరు: పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గంపలగూడెం మండలం మేడూరులో పశువులకు శనివారం గురక, గొంతు వాపు వ్యాధి నివారణ టీకాలు వేశారు. పశువైద్యాధికారి అభిలాష్ మాట్లాడుతూ ముందస్తుగా టీకాలు వేయడం ద్వారా పశువులను వ్యాధుల నుంచి రక్షించవచ్చన్నారు. నాలుగు నెలలు పైబడిన పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని, మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ టీకాలు వేస్తామని చెప్పారు.

ముమ్మరంగా పోలవరం–యడవల్లి రోడ్డు పనులు

చాట్రాయి: మండలంలోని పోలవరం నుంచి లింగపాలెం మండలం యడవల్లి రెండు కిలో మీటర్ల బీటీ రోడ్డు నిర్మాణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. అప్పట్లో వైఎస్సార్ సీపీ నాయకులు చెలికాని బాబ్జీ, గ్రామ ప్రజలు ఈ రోడ్డు నిర్మించాలని మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు దృష్టికి తీసుకు వెళ్లడంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ. 1.90 కోట్లు నాబార్డు నిధులు మంజూరు చేసింది. ఏలూరు జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే పోలవరం నుంచి ఫాతిమాపురం అడ్డ రోడ్డుకి వెళ్లాల్సి ఉండేది. అదే పోలవరం–యడవల్లి మీదుగా రోడ్డు నిర్మాణం చేట్టితే దూరాభారం తగ్గుతుంది. దీంతో ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు జిల్లా అధికారులతో సంప్రదించి రోడ్డు నిర్మాణ పనులకు నిధులు మంజూరు చేయడంతో మార్చిలో రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఎన్నికల ముందు రోడ్డు పక్కన ఉన్న జంగిల్ తొలగింపు, రోడ్డుపై పడిన గుంటలను పూడ్చే పనులు ప్రారంభించారు. ఎన్నికల కోడ్ రావడంతో పనులను నిలిపివేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం తిరిగి రోడ్డు పనులు ప్రారంభించారు. రోడ్డు నిర్మాణంపై రెండు గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



యంత్రంతో చేస్తున్న పోలవరం, యడవల్లి రోడ్డు

మంత్రిగారూ మమ్మల్ని కరుణించండి

చంద్రాల గ్రామంలో స్థలాలు కోల్పోయిన బాధితుల వినతి

మైలవరం: మంత్రిగారూ మమ్మల్ని కరుణించండి అంటూ చంద్రాల గ్రామంలో రోడ్డు వెడల్పులో స్థలాలు, ఇళ్లు కోల్పోయిన బాధితులు శనివారం రోడ్డెక్కారు. మైలవరం మండలం చంద్రాల గ్రామంలో రోడ్డు వెడల్పు చేయడానికి రోడ్డు పక్కన ఉన్న ఇళ్లను గతంలో అధికారులు కూలగొట్టించారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా మా గోడును పట్టించుకోవడంలేదని గ్రామస్తులు రోడ్డు పక్కన మంత్రి లోకేష్ ఫొటోతో ఫెక్సీలు ఏర్పాటు చేసి నిరసన తెలిపారు. సమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసినా పట్టించుకోవడం లేదని బాధితులు వాపోయారు. సమస్యను పట్టించుకోకుంటే జూన్ 2న ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.



చంద్రాల గ్రామంలో బాధితులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

ఆలయ పునర్నిర్మాణానికి అభ్యంతరాల స్వీకరణ

నూజివీడు: పట్టణంలోని కోటమహిషాసుర మర్దని ఆలయం శిథిలావస్థలో ఉన్నందున పునర్నిర్మించేందుకు నిర్ణయం తీసుకున్నందున ఎవరికైనా అభ్యంతరాలుంటే జూన్ 12 లోగా తెలియజేయాలని ఆలయ ఈఓ అలివేణి నోటీసులో పేర్కొన్నారు. ఈ మేరకు నోటీసును అమ్మవారి గుడిలోని తలుపునకు అంటించారు. పండుగల సమయంలో భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు కష్టతరంగా ఉన్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు అందులో పేర్కొన్నారు. అభ్యంతరాలను అమ్మవారి ఆలయంలోని కార్యాలయంలో గాని, కొడిమెల కొండయ్య శ్రీరామ విలాస సత్రంలో గాని ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల లోగా స్వయంగా వచ్చి లిఖితపూర్వకంగా తెలియజేయాలన్నారు. దీనిపై పట్టణంలోని పెద్దలు, ప్రముఖులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. పునర్నిర్మాణం గురించి ఎవరితో చర్చించకుండా దేవదాయ శాఖ అధికారులు సొంతగా ఎలా నిర్ణయం తీసుకుంటారని పలువురు ప్రశ్నిస్తున్నారు.

పింఛన్లు పంపిణీ చేసిన మంత్రి

ఆగిరిపల్లి: మంత్రి కొలుసు పార్థసారథి ఆగిరిపల్లిలో శనివారం పింఛన్లు పంపిణీ చేశారు. ఆదివారం సెలవు దినం కావడంతో ఒకరోజు ముందుగానే పింఛన్లు పంపిణీ చేశారు. ఆగిరిపల్లిలో కొందరు లబ్ధిదారుల ఇంటికి వెళ్లి మంత్రి పింఛన్లు అందజేశారు. మంత్రి మాట్లాడుతూ మండలంలో 9,425 మంది పింఛన్ లబ్ధిదారులకు రూ.41,29,950 అందిస్తున్నామన్నారు. పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



లబ్ధిదారుకు పింఛన్ అందజేస్తున్న మంత్రి పార్థసారథి

యోగాతో ఒత్తిడి నియంత్రణ

నూజివీడు: యోగా శారీరక వ్యాయామం కాదని, మానసిక ప్రశాంతత, ఒత్తిడి నియంత్రణకు ఎంతగానో ఇది ఉపయోగపడుతుందని నూజివీడు టౌన్ సీఐ పి. సత్యశ్రీనివాస్ అన్నారు. స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో శనివారం యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ నిత్యం ఒత్తిడికి లోనయ్యే పోలీసు సిబ్బందికి యోగా ఎంతో అవసరమన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో యోగాకు అత్యంత ప్రాధాన్యత ఉందని, ప్రపంచ వ్యాప్తంగా దీనిని ఆచరిస్తున్నారని చెప్పారు. యోగా సాధన వల్ల శారీరక ఆరోగ్యంతో పాటు ఒత్తిడి, ఆందోళనల నుంచి ఉపశమనం కలుగుతుందని వివరించారు. కార్యక్రమంలో నూజివీడు టౌన్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



నూజివీడు టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో యోగా సాధన చేస్తున్న సీఐ సత్యశ్రీనివాస్, సిబ్బంది

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

తిరువూరు: మండలంలోని పెనుగొలనులో శనివారం బీజేపీ ఆధ్వర్యంలో అహల్యాబాయి హోల్కర్ జయంతి కార్యక్రమం నిర్వహించారు. మరాఠా సామ్రాజ్యంలో 30 సంవత్సరాలు ధర్మబద్ధంగా పరిపాలన చేసి ఆలయాల నిర్మాణం, పేదలు, స్త్రీల సంక్షేమానికి ఆమె పాటుపడ్డారని బీజేపీ నాయకులు సూర్యప్రకాష్ వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అహల్యాబాయి జీవిత గాథపై వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులందజేశారు. ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరసింహారావు, లైబ్రేరియన్ శ్రీలత, సాయిబాబా సేవా కమిటీ అధ్యక్షుడు పూటుకూరు నారాయణరావు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మ వారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి శనివారం తెలంగాణ రాష్ట్రం సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలం దోసపాడు గ్రామానికి చెందిన దొంగరి మంగయ్య, కవిత దంపతులు రూ.10,116 ఆలయ ఏఈఓ తిరుమలేశ్వరరావు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త బెజవాడ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

2న అండర్–23 కృష్ణా జిల్లా బాస్కెట్ బాల్ జట్ల ఎంపిక

నూజివీడు: పట్టణంలోని వీటీహెచ్ ఆవరణలో అండర్–23 కృష్ణా జిల్లా మహిళల, పురుషుల బాస్కెట్‌బాల్ జట్ల ఎంపికను ఈనెల 2న నిర్వహిస్తామని అసోసియేషన్ అధ్యక్షుడు జి. సుభాష్‌చంద్రబోస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సెలక్షన్లలో పాల్గొనే అభ్యర్థులు తమ బోనఫైడ్ సర్టిఫికెట్, పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, స్టాంప్ సైజ్ ఫొటోలు, తీసుకుని రావాలన్నారు. 2002 జనవరి ఒకటో తేదీ కంటే ముందు జన్మించిన వారే ఈ సెలక్షన్లలో పాల్గొనేందుకు అర్హులని పేర్కొన్నారు. కృష్ణా జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్‌కు అనుబంధంగా ఉన్న క్లబ్ సభ్యులు మాత్రమే ఈ సెలక్షన్లలో పాల్గొనేందుకు అర్హులన్నారు. ఎంపికైన జట్లు ఈనెల 4, 5 తేదీల్లో చిత్తూరులో నిర్వహించే బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొంటారన్నారు.

ఏపీపీకి అభినందన

నూజివీడు: పట్టణంలోని 15వ అదనపు జిల్లా జడ్జి కోర్టు ఏపీపీ వాకా రాజ్‌కుమార్‌ను రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్ చైర్మన్ పోలుపర్తి వెంకట గణేష్‌కుమార్ శనివారం నూజివీడులో మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. అనంతరం గణేష్‌కుమార్‌ను వాకా రాజ్‌కుమార్ శాలువాతో సత్కరించారు. కౌన్సిలర్లు నవుడు నాగమల్లేశ్వరరావు, దాసరి మారు అప్పాజీ, కొప్పుల వెలమ పెద్దలు మరడా దుర్గారావు, వాకా నాగరాజు, పల్లె నాగరాజు, ఎదురేశి ఎరకయ్య, జీవీ రామారావు, సలుమూరు మూర్తి, పాశిల సత్యనారాయణ, న్యాయవాది వై. హరిబాబు, ఆదరపురెడ్డి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

హీరో కృష్ణకు నివాళి

ముసునూరు: జానపద, పౌరాణిక, సాంఘిక, కుటుంబ కథా చిత్రాల కథానాయకుడుగా పలు పాత్రల్లో నటించి, జీవించిన నటుడు సూపర్‌స్టార్ కృష్ణ అని మండల పౌరాణిక నాటక కళాకారుల సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు కూసం మార్కండేయులు, సత్యనారాయణ అన్నారు. చెక్కపల్లి సెంటర్‌లో ఆ సమాఖ్య, కృష్ణ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో కృష్ణ జయంతి కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పలువురు కళాకారులు, అభిమానులు నాగేశ్వరరావు, శ్రీనివాస్, రాంబాబు, సత్యనారాయణ, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై కేసు నమోదు

ఇబ్రహీంపట్నం: వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మే 29న ఇబ్రహీంపట్నంలో మాజీ మంత్రి జోగి రమేష్ కుమారుడి వివాహ రిసెప్షన్‌కు హాజరైన క్రమంలో ర్యాలీలో చోటుచేసుకున్న పరిణామాలపై మరో ఇద్దరు వైఎస్సార్ సీపీ కార్యకర్తలను శుక్రవారం రాత్రి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రెండు రోజుల కిందట కనకారావు అనే యువకుడిని అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో ప్రశ్నించడంతో అతను చెప్పిన వివరాల మేరకు జి.కొండూరుకు చెందిన గోవింద్‌రెడ్డి, ఇబ్రహీంపట్నానికి చెందిన ఉప్పతల గోపిరాజును అదుపులోకి తీసుకున్నారు. వీరిని విచారించిన అనంతరం కేసు నమోదు చేశారు.